ఘనంగా అమ్మవారి శిరస్సు మెరవణి

-నేడు అమ్మవారి విశ్వరూప దర్శనం



తిరుపతి గంగమ్మ



దేవతల వేషధారణల్లో చిన్నారులు

పలమనేరు: పలమనేరు పట్టణంలో అత్యంత వైభవంగా సాగే తిరుపతి గంగమ్మ జాతరలో శిరస్సు మెరవణి ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ప్రజలు పెద్ద సంఖ్యలో జాతరకు హాజరుకానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ, దేవదాయ శాఖాధికారులు ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లను చేపట్టారు. మరోవైపు పొరుగునే ఉన్న మారెమ్మ ఆలయంలో పొంగళ్ల కార్యక్రమం ఘనంగా సాగింది. జాతరను శాంతియుతంగా నిర్వహించేందుకు భారీగా పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నట్లు స్థానిక డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మరోవైపు మున్సిపల్ అధికారులు ఆలయం వద్ద పలు చర్యలు తీసుకున్నారు. అమ్మవారి జలిధి చోట అవసరమైన పనులను చేపట్టారు. అక్కడి బావిలో నీళ్లను నింపే కార్యక్రమం కూడా జరగనుంది. జాతరకోసం ఇప్పటికే బంధువులు పలమనేరుకు చేరుకుంటున్నారు. దీంతో పట్టణంలో జాతర సందడి కనిపిస్తోంది.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు..

గంగమ్మ జాతర సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ చేపడుతున్న సౌకర్యాలను, జాతర నిర్వహణ అంశాలపై పోలీస్, ఎండోమెంట్ అధికారులు ఆదివారం పరిశీలించారు.

అమ్మవారి శిరసు మెరవణి..

తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా నేటి రాత్రి 12 గంటలకు పాతపేట నుంచి అమ్మవారి శిరస్సు మెరవణి అత్యంత కోలాహలంగా జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. శిరస్సు మెరవణి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే అదనపు బలగాలు పట్టణానికి చేరుకున్నాయి. పలుచోట్ల సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయించారు. ప్రజలు శాంతియుతంగా జాతర జరుపుకోవాలని పోలీసులు తెలిపారు. జాతరకోసం ఆరుగురు సీఐలు, 20మంది ఎస్ఐలు, 180మంది సిబ్బంది హాజరు కానున్నట్లు డీఎస్పీ తెలిపారు.



గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో వాల్మీకి సంఘ నేతలు



ఆలయం వద్ద మహిళలు

వాల్మీకి సంఘంచే ప్రత్యేక పూజలు....

గంగజాతరలో భాగంగా స్థానిక వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు పట్టణంలో ప్రదర్శనగా వచ్చి మారెమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో ఎల్ భాస్కర్, వాల్మీకి సంఘ నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా తిరుపతి గంగమ్మ జాతర



ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు

కుప్పం: పట్టణంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి జాతరకు చాటింపు వేసిన విషయం తెలిసిందే. ఆదివారం భక్తులు అమ్మవారికి పిండి దీపాలు వెలిగించి పొంగళ్లు పెట్టారు. తిరుపతి గంగమ్మ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

టి.వడ్డూరులో..

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరులో ఆదివారం గంగజాతర ఘనంగా జరిగింది. గ్రామంలోని కుంటి గంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు అమ్మవారి శిరసు మెరవణి అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్కభజనలు, కోలాటలు, పండరీభజనలు, డప్పుల మోతల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. తమిళనాడు నుంచి విచ్చేసిన బృందం భారీగా బాణసంచా పేల్చింది. ఆదివారం ఉదయం నుంచి గ్రామంలో అమ్మవారి జాతర సాగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. నేటి జలధి కార్యక్రమంతో ఇక్కడ జాతర ముగుస్తుంది.

క్లుప్తంగా

విరూపాక్షమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో విరూపాక్షమ్మ

పులిచెర్ల(కల్లూరు): గంగజాతర సందర్భంగా తొలిరోజు కల్లూరులో వెలసిన విరూపాక్షమ్మకు ఆదివారం ప్రత్యేకఅలంకరణ చేశారు. మూడు రోజుల పాటు జరిగే గంగజాతరలో చలువ పందిళ్లు వేసి భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. అత్యంత వైభవంగా మూడు రోజులు జాతర కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు అమ్మవారికి సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

రేపటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

గంగవరం: మండలంలో మంగళ, బుధవారం రెండు రోజులు పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మంగళవారం నాయనిచెరువు, ఎగువ గొర్రెలదొడ్డి, ఎర్రోనిగుట్ట నడిమి, దిగువ గొర్రెలదొడ్డి, కురప్పల్లిలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, పార్టీ శ్రేణులు తప్పక హాజరు కావాలని కోరారు.

సేవలందించడమే లక్ష్యం



బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

వి.కోట: ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ట్రస్ట్ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిగార్డెన్-1 గల ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలకు బియ్యం, వంట సామగ్రి, మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించారు. అలాగే భరత్‌నగర్‌లోని సంఘమిత్ర వృద్ధాశ్రమానికి 50 కేజీల బియ్యం, 10 కేజీల పప్పు, 10 లీటర్ల నూనె, ఇతర వంట సామగ్రిని పంపిణీ చేశారు. వి.కోట సీహెచ్‌సీలోని బాలింతలకు పాలు, ఫలహారాలు, భోజన సౌకర్యం కల్పించారు.

వేడుకగా మాతృదినోత్సవం



తల్లులకు సన్మానం

పలమనేరు: మండలంలోని కళామందిరంలో ఆదివారం మాతృభాషాదినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విభిన్న రంగాల్లో సేవలందించిన తల్లులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా పిల్లలకు వేసవి సెలవుల్లో వ్యక్తిత్వ వికాసంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా పిల్లలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రచయిత జన్నావిత్తుల రామచంద్రమూర్తి, శ్రీపురం సీతారామయ్య, నరేంద్ర పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు



బోధన చేస్తున్న ఉపాధ్యాయులు

వి.కోట: పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు పుస్తకపఠనం, వినోదం, గణితం, కథలు చెప్పడం, సంగీతం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు చేపడుతున్నట్లు గ్రంథాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ సెలవుల్లో గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

డీఆర్ బకాయిలను చెల్లించాలి



మాట్లాడుతున్న గురురాజారావు

పలమనేరు: పెండింగ్‌లోని డీఆర్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు తెలిపారు. పట్టణంలోని ఏపీ ఎన్జీఓ సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లోని డీఆర్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

● వికసించిన మే పుష్పాలు



మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆదివారం మే పుష్పాలు వికసించాయి. మూడేళ్లుగా మేలోనే ఈ పుష్పాలు వికసిస్తున్నట్లు శక్తి క్షేత్రం నిర్వాహకులు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, రాధిక దంపతులు తెలిపారు.

- తవణంపల్లె

శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ భరత్



ఆలయం వెలుపల ఎమ్మెల్సీ భరత్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ఎమ్మెల్సీ భరత్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు.

వీరాంజనేయ స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఈఓ వెంకటేశు, అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం వీరాంజనేయ స్వామికి పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు సమర్పించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో ఆలయ ఈఓ, అధికారులు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారి పట్టు వస్త్రాలను తీసుకెళ్లి సమర్పించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అధికారులకు, భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

ఆంజనేయునికి గ్రామోత్సవం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం శ్రీవీరాంజనేయునికి ఆదివారం రాత్రి ఆలయ అధికారులు, గ్రామోత్సవం నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు.

ముత్యాలమ్మ జాతర రేపు



అలంకరణలో ముత్యాలమ్మ

రొంపిచెర్ల: ఈనెల 16వ తేదీ రొంపిచెర్లలో ముత్యాలమ్మ జాతర జరుగుతుందని ఆలయ అర్చకులు గుణశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి అమ్మవారికి 101 బిందెల పసుపు నీళ్లతో పంచామృత, సుగంధ ద్రవ్యాలతో మహాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన



విద్యాకిట్లను పరిశీలిస్తున్న గీత, అజయ్‌కుమార్‌రెడ్డి



కుప్పానికి చేరిన కిట్లు

పుంగనూరు: విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సరఫరా చేసిన జగనన్న విద్యాకానుక కిట్లను ఆ పథకం వెరిఫికేషన్ టీమ్ మెంబర్ గీత పరిశీలించారు. ఆదివారం జిల్లా సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాకానుక కిట్లపై పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేసే విద్యాకానుక కిట్ల విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, సాక్సులు, షూలు రావాల్సి ఉందన్నారు. వాటిని కూడా త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వచ్చిన కిట్లను ఎంఆర్‌సీల ద్వారా పాఠశాలల ప్రారంభానికి ముందే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, నోడల్ హెచ్‌ఎంలు నాగరాజారెడ్డి, సుబ్రమణ్యం, సీఆర్‌పీలు శ్రీనివాసులు, లతీఫ్, నారాయణస్వామి, దీప, మీనాక్షి, అంజమ్మ, మంజుల, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు వచ్చేశాయ్!

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే కిట్లు విద్యాసంవత్సరం ప్రారంభానికి నెల ముందే ప్రభుత్వ పాఠశాలలకు చేరాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే యూనిఫాం, బెల్టులు, పాఠ్యాంశ పుస్తకాలు, రాగిజావా కోసం ప్రత్యేకంగా చెంబులు, టైలు వివిధ పరికరాలను మండల విద్యాశాఖ కు చేరాయి. వీటిని మండలంలోని ప్రభుత్వం పాఠశాలకు విద్యాశాఖ అధికారులు పంపిణీ చేయనున్నారు. 2023 విద్యాసంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు శివ, శ్రీరాములు

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ, డాక్టర్ కె.సరళ, క్లబ్ అధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వారిచే వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 30మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఈశ్వరమ్మ, గోపాలకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

వినాయకుడిని దర్శించుకున్న జెడ్పీ చైర్మన్



జెడ్పీ చైర్మన్‌కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా ఆదివారం స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



పుంగనూరు:ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి



సదుంలో..



చల్లావారిపల్లెలో..



వి.కోట: పత్తి అలంకరణలో..



రాయలపేటలో..

పుంగనూరు: మండలంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లోనూ స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అరవపల్లె వద్ద గల ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, హనుమంతరాయుని దిన్నెలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, సుబ్బమ్మ చెరువు వద్ద గల వీరాంజనేయస్వామి ఆలయం, పట్టణంలోని కోనేటి వద్ద గల ఆభయాంజనేయస్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పెసరపప్పు, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): చల్లావారిపల్లెలో హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, కర్పూర హారతులు ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

సదుంలో..

సదుం: మండలంలో హనుమజ్జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంభంవారిపల్లె క్రాస్ వద్ద ఉన్న స్వామి వారికి భక్తులు పూజలు చేశారు. ఎర్రాతివారిపల్లె పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి కాలనీలోని కన్యమూల వినాయకస్వామి ఆలయం, గార్గేయనదీ తీరాన ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయాల్లో అభిషేకాలు, ఆకుపూజలు ఘనంగా నిర్వహించారు.

పెద్దపంజాణి: మండలంలో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లోని ఆంజనేయస్వామికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల వద్ద సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దిన్నిపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా చేశారు.

వి.కోట: స్థానికంగా వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారు పత్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు చేశారు. అనంతరం సుందరభరితమైన రకరకాల పుష్పాలతో స్వామివారిని ప్రత్యేకంగా దూదితో అలంకరించి విశిష్ట పూజలు చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

సులభతరంగా అమ్మవారి దర్శనం



బ్యాగుల షాపులను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న పెద్దిరెడ్డి

- ఆహ్లాదకరాన్ని తలపించేలా పార్క్‌పై దృష్టి
- అభివృద్ధి పనులను పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చే భక్తులకు సులభతరంగా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేలా చర్యలు తీసుకున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన క్యూలను, వివిధ అభివృద్ధి పనులను ఈఓ చంద్రమౌళి, కాంట్రాక్టర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా పెద్దిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఉపాధి నిధులతో ఏర్పాటుచేసిన పార్క్‌ను మరింత ఆకర్షణీయంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపించేలా తీర్చిదిద్దాలని ఈఓ చంద్రమౌళిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. బోయకొండపై ప్లాస్టిక్ రహిత ఆలయంగా మార్చుతేవడానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా సహకరించాలని కోరారు. వాహనాల పార్కింగ్ సమస్యను నిరోధించడానికి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే భక్తులు వాహనాలను పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే యాత్రికులకు సులభతరంగా దర్శనం పొందేలా ఏర్పాటుచేసిన సేవలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన పనులకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నేతలు మల్లికార్జునరెడ్డి, రాశెట్టి మధు, సురేంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.